సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 11 । జూన్ । 2025



రాజంపేట రైల్వే స్టేషన్‌కు సొబగులు!

రాజంపేట రైల్వే స్టేషన్ ఆధునీకరణకు మోక్షం లభించింది. అమృత్ భారత్ స్టేషన్ పథకంతో స్టేషన్ రూపురేఖలు మారిపోయాయి. -8లో



నాన్న కలలే.. నిజమయ్యే నేడు..

ఓబులవారిపల్లె మండలం వై.కోటకు చెందిన పసుపులేటి చంద్ర, మాధురీదేవిల కుమార్తె భవ్యశ్రీ తెలంగాణ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.220	రూ.272
రెండోరకం	రూ.150	రూ.210

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1213 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

హుండీ ఆదాయం రూ.14,84,740



తరిగొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న టీటీడీ అధికారులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి హుండీ ద్వారా రూ. 14,84,740 ఆదాయం వచ్చింది. మంగళవారం స్థానిక ఆలయంలో టీటీడీ వారి ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మూడు నెలల కాలానికి సంబంధించి హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ. 14,84,740 వచ్చినట్లు టీటీడీ అధికారి రత్తయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు గోపాలబట్టర్, కృష్ణస్వామి, రాజుస్వామి, గోకుల్‌స్వామి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్తగా ఏర్పడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాల హక్కుల పరిరక్షణ కమిషన్‌లో చైర్‌పర్సన్, సభ్యుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ దేవిరెడ్డి శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్‌తోపాటు మొత్తం ఆరుగురు సభ్యుల నియామకానికి దరఖాస్తులను కోరుతున్నారన్నారు. చైర్‌పర్సన్‌కు గరిష్ట వయసు 65 ఏళ్లు, సభ్యులకు 60 ఏళ్లు ఉండాలన్నారు. అభ్యర్థులు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్ డిగ్రీ కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయో డేటా, సంబంధిత ధ్రువపత్రాలతో కూడిన దరఖాస్తులను 2025 జూన్ 19 సాయంత్రం 5:30 గంటలలోపు గుంటూరు అమరావతి రోడ్డులోని జంపాని టవర్స్, 4వ అంతస్తులోగల మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ కార్యాలయానికి పంపాలన్నారు. మరిన్ని వివరాలకు 9440814416 నెంబరులో కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలన్నారు.

పీఎం సూర్యఘర్ యోజనతో కరెంటు బిల్లు ఆదా



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ జిల్లా పర్యవేక్షణ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి

రాయచోటి జగదాంబసెంటర్: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన ద్వారా సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లు ఆదా చేయడమే కాకుండా పర్యావరణానికి మేలు చేయవచ్చని ఏపీఎస్పీడీసీఎల్ అన్నమయ్య జిల్లా పర్యవేక్షణ అధికారి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి పట్టణం చిత్తూరు రోడ్డులోని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా కార్యాలయంలో డీఈ యుగంధర్ ఆధ్వర్యంలో పీఎం సూర్యఘర్ యోజన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ యోజన కింద సౌర విద్యుత్ ప్లాంట్‌ను పెట్టుకోవడానికి కేంద్ర ప్రభుత్వం రూ.78 వేలు సబ్సిడీ ఇస్తుందన్నారు. ఒకసారి పెట్టుబడి పెట్టి సోలార్ ప్యానల్‌ను అమర్చుకోవడం వల్ల 40 సంవత్సరాల పాటు సున్నా కరెంటు బిల్లుతో సంతోషంగా జీవించొచ్చు అన్నారు. ఈ పథకం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందన్నారు. ఈ పథకానికి బ్యాంకు వారు 90 శాతం రుణం ఏడు శాతం వడ్డీతో ఇస్తారని తెలిపారు. డీఈ యుగంధర్ మాట్లాడుతూ 1 కిలో వాట్‌కు రూ.30 వేలు, 2 కిలోవాట్‌కు రూ.60 వేలు, 3 కిలోవాట్ ఆపైన రూ.78 వేల సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

బడి బస్సు భద్రమేనా!



వేసవి సెలవులకు టాటా చెప్పి పిల్లలు బడి బాట పట్టనున్నారు. వీరిని బడికి చేర్చేందుకు బస్సులు సిద్ధమవుతున్నాయి. అవి ఎంత మాత్రం కండీషన్‌లో ఉన్నాయి.. పిల్లలను అందులో పంపడం క్షేమమేనా అన్నది తల్లిదండ్రులను వేధిస్తున్న ప్రశ్న. రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టడం అవసరం.

- రేపటి నుంచి ప్రారంభం కానున్న పాఠశాలలు
- అన్నమయ్య జిల్లాలో 745కు పైగా ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల బస్సులు
- ఇంకా 554 బస్సులకు తనిఖీలు పూర్తి చేయాలంటున్న ఆర్‌టీఏ అధికారులు
- కాలం చెల్లిన వాహనాలతో ఆందోళన
- అనుభవం లేని డ్రైవర్లు, కెపాసిటీకి మించి విద్యార్థుల తరలింపు
- నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు
- ఆర్టీఏ అధికారి ప్రతాప్ హెచ్చరిక



రాయచోటి: ఈనెల 12 నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. తమ పిల్లలకు మంచి చదువులు చెప్పించడానికి తల్లిదండ్రులు దూర ప్రాంతాల్లోని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలకు పంపించేందుకు వెనుకాడటం లేదు. పాఠశాలల ప్రమాణాలను, వారి స్థాయిని బట్టి సుదూర ప్రాంతాలలోని పది నుంచి ముప్పై కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలలకు కూడా పిల్లలను పంపుతున్నారు. అయితే తమ పిల్లలను తీసుకెళ్తున్న స్కూల్ బస్సులు, ఇతర వాహనాల కండీషన్‌పై తల్లిదండ్రుల్లో ఒకింత ఆందోళన లేక పోలేదు. ఇందుకు కారణం జిల్లా, రాష్ట్రంలోనే కాకుండా దేశ వ్యాప్తంగా స్కూల్ బస్సులు ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలే. స్కూల్ బస్సుల విషయంలో యజమానులు నిబంధనలు పాటించకపోవడమే. సాధారణంగా స్కూల్ బస్సులలో 25 నుంచి 40 వరకు సీటింగ్ సామర్థ్యం ఉంటుంది. కానీ యాజమాన్యం మాత్రం 40 నుంచి 60 మంది విద్యార్థులకు పైగా బస్సులలో ఎక్కించి ప్రయాణం సాగిస్తుంటారు. ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే పెద్ద మొత్తంలో ప్రాణనష్టం జరిగే అవకాశాలు లేకపోలేదు. చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూళ్లకు ఆటోలో పంపిస్తున్నారు. వాటిల్లో కూడా డ్రైవర్లు పరిమితికి మించి పిల్లలను ఎక్కించుకొని తీసుకెళ్తుండటంతో అనేక మంది బస్సులపైనే దృష్టి సారించారు. బస్సుల నిర్వహణలో సరైన నిబంధనలు పాటించకపోవడంతో తల్లిదండ్రులకు ఆందోళన తప్పడం లేదు.

ఫిట్‌నెస్ తనిఖీలు...

పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో రవాణాశాఖ అధికారులు ప్రైవేటు పాఠశాలల బస్సులపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు మే నెల 15వ తేదీ లోగా రవాణా శాఖ కార్యాలయాల్లో బస్సుల ఫిట్‌నెస్ కాగితాలను సమర్పించి సామర్థ్యపు పరీక్షలు చేయించుకోవాల్సి ఉంది. జూన్ 5లోగా ఏవైనా లోపాలు ఉంటే సరిదిద్దుకొని సామర్థ్యపు పరీక్షలు చేయించుకోవడానికి అవకాశం ఉంది. పత్రాలు అందిన బస్సులను రవాణాశాఖ అధికారులు కూడా తనిఖీలు చేయడం ప్రారంభిస్తారు. బస్సులను ఆర్టీఏ కార్యాలయానికి పిలిపించి నిశితంగా పరిశీలిస్తున్నారు. వాహనాల తనిఖీ నిమిత్తం ఇప్పటికే ఆయా పాఠశాలలకు రవాణాశాఖ కార్యాలయం నుంచి నోటీసులు కూడా పంపారు. ఫిట్‌నెస్ లేకుండా రోడ్డుమీద తిరిగితే తగు చర్యలు తీసుకోవడానికి రవాణాశాఖ అధికారులు రంగంలోకి దిగారు.

554 బస్సులకే సామర్థ్య పరీక్షలు..

బస్సుల ఫిట్‌నెస్‌లో భాగంగా రవాణాశాఖ అధికారులు తనిఖీ చేసే నిమిత్తం నోటీసులు పంపినా కొన్ని పాఠశాలల యాజమాన్యం స్పందించడం లేదన్న సమాచారం ఉంది. విద్యార్థుల ప్రయాణం విషయంలో ఎన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచిస్తున్నా రవాణా, పోలీస్ శాఖ హెచ్చరికలు బేఖాతర్ చేస్తున్నారు. జిల్లాలోని రాయచోటి , మదనపల్లి, తంబళ్లపల్లి, పీలేరు, రాజంపేట, కోడూరు నియోజకవర్గాల పరిధిలో ఉన్న పాఠశాలలకు 745 బస్సులు ఉన్నాయి. విద్యార్థుల రవాణా కోసం వాడుతున్నారు. ఇప్పటివరకు 554 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయినట్లు రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. ఇక రెండు రోజుల్లో మిగిలిన 191 బస్సులను పరీక్షించుకోవాల్సి ఉంది. వీటితోపాటు నూతనంగా ఏర్పాటు చేస్తున్న బస్సులకు కూడా పాఠశాలలు, కళాశాల యాజమాన్యం ఫిట్‌నెస్ పరీక్షలను చేయించుకోవాలి.

నిబంధనలు పాటించకపోతే బస్సులను సీజ్ చేస్తాం



పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభమవుతున్న దృష్ట్యా పిల్లల సురక్షిత ప్రయాణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ క్రమంలో బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. అన్నమయ్య జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల యాజమాన్యం స్పందించి బస్సులను కండీషన్‌లో ఉంచుకోవాలి. వాహనాలకు సంబంధించి ఏ పత్రం లేకున్నా, నడిపినా చర్యలు తీసుకోవడంతోపాటు జప్తు చేస్తాం. ఇదే విషయంపై అన్ని కళాశాలల యాజమాన్యాలకు నోటీసుల ద్వారా తెలియపరిచాం. స్కూల్ బస్సు డ్రైవర్లకు ఐదు సంవత్సరాలు భారీ వాహనం నడిపిన అనుభవం ఉండాలి. ప్రతి పాఠశాల బస్సుకు డ్రైవర్‌తోపాటు ఒక సహాయకుడు తప్పనిసరిగా ఉండాలి. బస్సు కండీషన్‌లో ఉండటమే కాకుండా బ్రేక్ వేసినప్పుడు నాలుగు దిక్కులా పార్కింగ్ లైట్లు వెలిగేలా చూసుకోవాలి. ప్రథమ చికిత్స బాక్స్, ఫైర్, అత్యవసర ద్వారాలు ఉండాలి. చిన్నపిల్లలు బస్సు ఎక్కేలా మెట్టికలు కింది భాగంలో అదనంగా మరో మెట్టు అమర్చుకోవాలి. కిటికీలకు ఇరువైపులా నాలుగు వరుసల పైపులు, పిల్లలు తలలు బయటపెట్టి చూడకుండా జాలి కట్టాలి. వాహనం వేగంగా నడిపినా, అజాగ్రత్తగా వ్యవహరించినా, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడిపినా డ్రైవర్‌పై చర్యలు తీసుకునేలా పేరెంట్స్ కమిటీ ద్వారా బస్సులో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలి. బస్సుకు ముందు, రెండువైపులా పాఠశాల, కళాశాలల పేర్లు, సెల్‌ఫోన్ నెంబర్లు విధిగా రాయాలి.

– అశోక్ ప్రతాప్ రావ్, అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి రవాణా అధికారి

కాలం చెల్లిన బస్సులకు పైపై మెరుగులు..

స్కూల్ బస్సులలో అధిక భాగం కాలం చెల్లినవి ఉన్నాయి. కొన్ని విద్యా సంస్థలు కాలం చెల్లిన బస్సులకు పైపై మెరుగులు దిద్ది నడుపుతున్నారు. వీటిలో ఎక్కువభాగం 15 సంవత్సరాలు పాటు నడిచినవే. ఇలాంటి వాటికి మరింత గడువు తీసుకొని నడుపుతున్నారు. చాలా పాఠశాలలు విద్యార్థుల రవాణాకు వాడుతున్న బస్సులను సెకండ్ హాండ్స్‌లో తక్కువ ధరలకు కొన్నవే. వీటిలో ఎక్కువ కర్ణాటక, తమిళనాడు, పొరుగు జిల్లాలైన చిత్తూరు, అనంతపురం, తిరుపతి నుంచి తీసుకువచ్చినవే ఉన్నాయి. మరికొందరు సమయం దాటిపోటిన ఆర్టీసీ అద్దె బస్సులను కొనుగోలు చేసి వాడుతున్నారు. ఇలాంటి వాటిని రవాణాశాఖ అధికారులు రోడ్డుపైన తిరగనివ్వకుండా నిలుపుదల చేయాల్సి ఉంది.

మోటారు వాహన చట్టంలోని అంశాలు ఇవే..



మోటారు వాహన చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, పన్ను చెల్లింపు రశీదు, పొల్యూషన్, కంట్రోల్ సర్టిఫికెట్‌తోపాటు డ్రైవర్లకు లైసెన్సు తప్పనిసరిగా ఉండాలి. డ్రైవర్ ఫొటోను బస్సులో ఏర్పాటు చేయాలి. అద్దాలకు గ్రిల్స్ ఏర్పాటు చేయాలి. డ్రైవర్ వయస్సు 60 సంవత్సరాలకు మించరాదు. ప్రతి బస్సులో విద్యార్థులకు తోడుగా ఒక అటెండర్ ఉండాలి. పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి బస్సులను తనిఖీ చేయాలి. పరిమితికి మించి విద్యార్థులను బస్సులో ఎక్కించరాదు. బస్సులకు తప్పనిసరిగా పసుపు రంగు వేయాలి. పాఠశాల పేరు, సెల్ నెంబరు, పూర్తి చిరునామా ఎడమవైపు కనిపించేలా ఉండాలి. డ్రైవర్లు మూడు నెలలకు ఒకసారి బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలి. బస్సు కిటికీలకు మధ్యన రెండు కడ్డీలను తప్పకుండా అమర్చి ఉండాలి. అయితే ఈ నిబంధనలను చాలా పాఠశాలలు పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి .

రచ్చకెక్కిన తెలుగు మహిళలు

మంత్రి కార్యాలయం ముందే బూతు పురాణం

రాయచోటి: మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన రాయచోటిలో మహిళా నేతలు పరుష పదజాలాలతో రోడ్డెక్కి రచ్చరచ్చ చేశారు. మంగళవారం మధ్యాహ్నం డ్వాక్రా మహిళలతో ర్యాలీ నిర్వహించాలని రాయచోటిలోని మంత్రి కార్యాలయానికి మహిళలు చేరుకున్నారు. ఇదే సందర్భంలో ఒక్కసారిగా టీడీపీ సీనియర్ మహిళా నాయకురాలు సుజాత.. మరో టీడీపీ నాయకురాలు లక్ష్మీదేవిల మధ్య మాటలు తూటాలై.. బూతులు, వ్యక్తిగత విషయాలు ప్రస్తావిస్తూ.. కొట్టుకునే స్థాయికి రచ్చకెక్కారు. ర్యాలీకి వచ్చిన మహిళలు వారి మాటలు వినలేక అక్కడి నుంచి వెళ్లిపోయారు. వారిద్దరి నోటి నుంచి వెలువడిన బూతు పురాణం మంత్రి కార్యాలయం వద్ద ఉన్న పురుషులను సైతం ఈసడించుకునేలా చేసింది. మహిళలకు ఆదర్శంగా ఉండాల్సిన తెలుగు మహిళలే ఇలా రోడ్డెక్కి వ్యక్తిగత దూషణలు చేసుకోవడం ఎంతవరకు సమంజసం అంటూ అక్కడున్న తెలుగు తమ్ముళ్లు మాట్లాడుకోవడం విశేషం.

వైఎస్‌ఆర్ జిల్లా వ్యవసాయ అధికారిగా చంద్రానాయక్

కడప అగ్రికల్చర్: జిల్లాలో ఉద్యోగుల బదిలీల పరంపర కొనసాగుతుంది. బదిలీల్లో భాగంగా వైఎస్సార్ జిల్లా వ్యవసాయ అధికారిగా చంద్రానాయక్ నియమితులయ్యారు. ఈయన అన్నమయ్య జిల్లా డీఏఓగా పని చేస్తూ వైఎస్సార్ జిల్లాకు బదిలీపై వచ్చారు. వైఎస్సార్ జిల్లా డీఏఓగా పని చేస్తున్న అయితా నాగేశ్వరావు గుంటూరు డీఏఓగా బదిలీపై వెళ్లారు. అలాగే జిల్లాలోని పలువురు ఏడీలతోపాటు ఏవోలు కూడా బదిలీ అయ్యారు.

జిల్లా ఉద్యానశాఖ అధికారిగా..

జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు నియమితులయ్యారు. ఈయన కూడా అన్నమయ్య జిల్లా ఉద్యానశాఖ అధికారిగా పని చేస్తూ వైఎస్సార్ జిల్లాకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఉద్యానశాఖ అధికారిగా పని చేస్తున్న సుభాషిణి అన్నమయ్య జిల్లా ఉద్యానశాఖ అధికారిగా బదిలీపై వెళ్లారు. వీరితోపాటు పలువురు మండల ఉద్యానశాఖ అధికారులు పలు మండలాలకు బదిలీ అయ్యారు.

హమ్మయ్యా.. రైలు ఆగింది!

- నేటి నుంచి ఏపీ సంపర్క్‌క్రాంతికి రాజంపేటలో హాల్టింగ్
- ఒకటిన్నర దశాబ్దం తర్వాత నెరవేరిన కల



రాజంపేట మీదుగా ఢిల్లీకి నడిచే ఏపీ సంపర్క్ క్రాంతి రైలు

రాజంపేట: ఆధ్యాత్మిక నగరం తిరుపతి నుంచి దేశరాజధానికి రాజంపేట, నందలూరు, కడప మీదుగా నడిచే ఏపీ సంపర్క్ క్రాంతి రైలు(12708/12707) పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో ఎట్టకేలకు బుధవారం నుంచి ఆగనుంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు హాల్టింగ్‌కు పచ్చజెండా ఊపి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమంలో పాల్గొనాలని ఎంపీలు పీవీ మిథున్‌రెడ్డి, మేడా రఘునాథరెడ్డి, రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డితోపాటు ఎమ్మెల్సీలకు రైల్వేశాఖ ఆహ్వానపత్రాలను అందజేసింది.

నాడు వైఎస్సార్‌తో ఢిల్లీ రైలు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టి ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలుపై పడింది. ఈ రైలును ఆధ్యాతిక నగరం తిరుపతి నుంచి పార్లమెంటరీ కేంద్రాలైన రాజంపేట, కడప మీదుగా సికింద్రాబాదు వరకు నడిపించాలని రైల్వేమంత్రిత్వ శాఖను కోరారు. 2007లో ఈ రైలు తిరుపతి నుంచి సికింద్రాబాదు టు ఢిల్లీకి నడిచింది. తిరుపతి నుంచి రేణిగుంట, రాజంపేట, నందలూరు, కడప , గుత్తి, డోన్, కర్నూలు, మహబూబ్‌నగర్ మీదుగా పొడిగించారు.

నేడు ఎంపీ మిథున్‌రెడ్డితో హాల్టింగ్..



గత 17 సంవత్సరాలుగా నడుస్తున్న ఢిల్లీ రైలుకు రాజంపేటలో హాల్టింగ్ ఇవ్వడానికి 17 ఏళ్లు పట్టింది. రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి ఎంపీ అయిన తొలినాటి నుంచి రాజంపేటలో ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్టింగ్ ఇవ్వాలని కోరుతూ వచ్చారు. రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌కుమార్, రైల్వేబోర్డు చైర్మన్‌ను అనేక దఫాలుగా కలిసి రాజంపేట పార్లమెంట్ హెడ్‌క్వార్టర్‌లో హాల్టింగ్ ఇవ్వాలని కోరారు. ఇటీవల రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి కూడా ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్టింగ్ ఇవ్వాలని రైల్వేశాఖను కోరారు. ఎట్టకేలకు రాజంపేటలో ఏపీ సంపర్క్ క్రాంతి రైలుకు హాల్టింగ్ ఇవ్వడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

గిరిజన గ్రామాల్లో సంక్షేమ పథకాలపై ప్రచారం

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



ఎంపీడీఓల సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: ధర్తీ ఆబా జంజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన గిరిజన గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. జిల్లాలో ఎంపిక చేసిన 4 మండలాల్లోని 17 గ్రామాలలో ఈ నెల 15 నుండి జూన్ 30 వరకు పథకాలపై ప్రచారం చేయాలని మంగళవారం కలెక్టర్ ఎంపీడీఓలను ఆదేశించారు. ఆధార్‌కార్డు, రేషన్ కార్డు తదితర కార్డులు లేని లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేయాలని పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లాలో గిరిజన జనాభా ఎక్కువగా ఉన్న లక్కిరెడ్డిపల్లె, రైల్వేకోడూరు, పెనగలూరు, కురబలకోట ఎంపీడీఓలతో పథకం నిర్వహణపై చర్చించారు.

ఇది రాష్ట్రమా.. రావణ కాష్టమా!

- రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపిస్తున్న కూటమి ప్రభుత్వం
- మహిళలకు రక్షణ కరువు
- అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ మహిళా నేతల వినతిపత్రం



నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీగా వస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు

రాయచోటి టౌన్: రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కాకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని దీంతో మహిళలకు రక్షణ కరువవుతోందని అన్నయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు ఆరోపించారు. మంగళవారం రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మహిత, కార్యదర్శులు ఏకుల రాజేశ్వరి, జానం రాధ అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు మహిళలకు రక్షణ కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్‌లు అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చేశారని ఆరోపించారు. అసలు రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ ఉందా అనే అనుమానం కలుగుతోందన్నారు. అన్యాయాలను అరికట్టాల్సిన పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించి మహిళా స్వేచ్ఛ దిశగా అడుగులు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అజంతమ్మ, మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల మహిళా అధ్యక్షులు మేరీ, పద్మజారెడ్డి, విజయలక్ష్మి, మిరియాల సురేఖ, నియోజక వర్గం అధ్యక్షురాలు లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులకు అనుగుణంగా ప్రకృతి వ్యవసాయం



చిన్నమండెంలో ప్రకృతి వ్యవసాయ సాగు మహిళలతో మాట్లాడుతున్న బృందం సభ్యులు

రాయచోటి: వాతావరణ మార్పులకు అనుగుణంగా ప్రకృతి వ్యవసాయాన్ని మెరుగుపరిచేందుకు అవసరమైన మార్గదర్శకాలను సిద్ధం చేస్తున్నట్లు ప్రపంచ ఆహార ప్రతినిధుల బృందం తెలిపింది. మంగళవారం జిల్లా కలెక్టర్ శ్రీధర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పర్యటన ఉద్దేశాన్ని తెలియపరిచారు. ప్రపంచ ఆహార కార్యక్రమ బృందం మూడు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం అన్నమయ్య జిల్లాలో పర్యటించింది. జిల్లాలో సాగుతున్న ప్రకృతి వ్యవసాయం తీరును పరిశీలించేందుకు మూడు రోజుల పాటు బృందం సభ్యులు జిల్లాలో పర్యటిస్తున్నట్లు బృందం ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బాలాజీ త్రిపాఠి తెలిపారు. బృందంలో తనతోపాటు ప్రోగ్రామ్ అసోసియేట్ కృష్ణమూర్తి, సౌమ్య, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకట మోహన్‌లు ఉంటారన్నారు. వాతావరణ మార్పులు ప్రభావాన్ని సమగ్రంగా అధ్యయనం చేయడం, ప్రకృతి వ్యవసాయంలో అమలవుతున్న పద్ధతులు, ప్రాంతాల్లో పరిశీలన చేయడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా చిన్నమండెం మండలంలోని రైతు శాస్త్ర కేంద్రాన్ని సందర్శించారు. బృందం సభ్యులు వాతావరణ మార్పుల ప్రభావం, పంటల దిగుబడి, ఆహార భద్రత, వ్యవసాయం జీవన విధానాలు, మార్పుల ప్రభావం గురించి రైతుల అభిప్రాయాలను సేకరించారు.

క్లుప్తంగా

మహిళ ఆత్మహత్య


లక్ష్మీదేవి (ఫైల్)

కురబలకోట : మండలంలోని సర్కారు తోపు సమీపంలో నేరేడు చెట్టుకు ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం ఉదయం జరిగింది. ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కథనం మేరకు.. మదనపల్లె పట్టణం చంద్రకాలనీకి చెందిన సాకల లక్ష్మీదేవి (46) కులవృత్తితోపాటు ఖాళీ సమయాల్లో కూలి పనులకు వెళ్లేది. పీటీఎం మండలం ఉప్పరోళ్లపల్లెకు చెందిన ఈమెకు 20 ఏళ్ల కిందట రవితో వివాహమైంది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో కొన్నేళ్ల క్రితం భర్తను విడిచి ఒంటరిగా ఉంటోంది. మంగళవారం ఉదయం సర్కారు తోపు సమీపంలో హైవేకు దగ్గరగా నేరేడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు కనుగొని పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న గుర్తు తెలియని వృద్ధుడు

ప్రొద్దుటూరు క్రైం : మైదుకూరు రోడ్డులోని ధారా అపార్ట్‌మెంట్ వెనుకవైపున గుర్తు తెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. చెట్టుకు ఉరేసుకొని ఉండటంతో ఆ ప్రాంత వాసులు మంగళవారం రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ అరుణ్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడికి సుమారు 65–70 ఏళ్లు ఉంటాయని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడికి సంబంధించిన వ్యక్తులు రూరల్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


వెంకటయ్య(ఫైల్)

గోపవరం : మండలంలోని రాచాయపేట పంచాయతీ బెడుసుపల్లి దళిత వాడకు చెందిన అట్లూరు వెంకటయ్య(45) రోడ్డు ప్రమాదంలో మంగళవారం మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. చెన్నవరం నుంచి ద్విచక్ర వాహనంలో వెంకటయ్య బెడుసుపల్లెకు వెళ్తున్నారు. మార్గమధ్యంలో అదుపు తప్పి రోడ్డు ప్రక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు హుటాహుటిన కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజంపేట రైల్వే స్టేషన్‌కు సొబగులు!



రాజంపేట రైల్వేస్టేషన్ ముఖద్వారం


సుందరీకరించిన ప్లాట్‌ఫామ్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో రాజంపేట రైల్వే స్టేషన్‌కు నూతన సొబగులు అద్దుతున్నారు. స్టేషన్ ఆధునీకరించి మెరుగైన సౌకర్యాల కల్పన దిశగా చేపట్టిన పనులు పూర్తికావస్తున్నాయి. రాజంపేట రైల్వే స్టేషన్ అన్నమయ్య విగ్రహ ముఖద్వారంతో స్వాగతం పలుకుతోంది.

- ఫలించిన ఎంపీ మిథున్‌రెడ్డి కృషి
- రైల్వే స్టేషన్ ఆధునీకరణకు మోక్షం
- రూ.2కోట్ల వ్యయంతో ఆధునికీకరణ
- పీవోబీకి లిఫ్ట్, ప్లాట్‌ఫాం కవరింగ్ షెడ్స్ నిర్మాణం

రాజంపేట : రాజంపేట రైల్వే స్టేషన్ ఆధునీకరణకు మోక్షం లభించింది. 2023–2024 సాధారణ బడ్జెట్‌లో అమృత్ భారత్ స్టేషన్ పథకాన్ని తీసుకొచ్చారు. అప్పట్లో రాజంపేట ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డి కృషితో రాంజపపేట స్టేషన్ ఈ పథకం కింద ఎంపికైంది. దీంతో ప్రయాణికులను ఆకర్షించేలా అన్ని వసతులను కల్పించి రూ.2 కోట్లకు పైగా వ్యయం చేసి నిర్మాణాలు చేపట్టారు. దీంతో స్టేషన్ రూపురేఖలు మారిపోయాయి. . కాగా ఈ స్టేషన్ మీదుగా రోజు 12 వారాంతపు రైళ్లు, నాలుగు ప్యాసింజర్ రైళ్లు నడుస్తున్నాయి.

రైలుమార్గం	చెన్నై–ముంబాయి
స్టేషన్	రాజంపేట
గ్రేడ్	ఎన్ఎస్‌జీ -5
డైలీ ట్రైన్స్	16
నాన్ డైలీ ట్రైన్స్	12
ప్యాసింజర్స్	4

ఎన్ఎస్‌జీ–5 స్టేషన్‌గా..

పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రం రాజంపేట రైల్వే స్టేషన్ ఎన్ఎస్‌జీ(నాన్ సబర్బన్ గ్రేడ్–5గా కొనసాగుతోంది. నెలకు లక్షలాది రూపాయల ఆదాయం ఈ మార్గంలో రైల్వేకు సమకూరుతోంది. అన్ని రైళ్లకు హాల్టింగ్ కొనసాగిన క్రమంలో లోడింగ్‌తో ఆదాయం బాగా వుండేది. నిమ్మతోపాటు పలురకాల వస్తువులు, ఉద్యానవన పంటల దిగుబడులను చెన్నై, హైదరాబాదు, ముంబాయి, ఎర్నాకులం, ఢిల్లీ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేయడంతో అక్కడి నుంచి దిగుమతులు చేసుకునేందుకు వీలుంగా ఉండేది.

హాల్టింగ్‌కు ఎంపీ కృషి..

రైళ్ల హాల్టింగ్‌కు ఎంపీ మిథున్ రెడ్డి తన వంతు కృషి చేస్తున్నారు. ఇటీవల రైల్వే మంత్రిని కలిసి రాజంపేట రైల్వే స్టేషన్‌లో రైళ్ల హాల్టింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. కోవిడ్ ముందు ఏ విధంగా రాజంపేట రైల్వే స్టేషన్‌ల్లో హాల్టింగ్ కొనసాగిందో.. అదే విధంగా పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో స్టేషన్ అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ఇప్పటికే రెండు ప్లాట్‌ఫాంల మధ్య ఫుట్ ఓవర్ బ్రిడ్జికి లిఫ్ట్ ఏర్పాటుచేశారు. ఆఫీసర్స్ రెస్ట్‌హౌస్, ఓపెన్ వెయింటింగ్ హాల్, స్టేషన్ పరిసరాల అభివృద్ధి పూర్తయింది. రెండు ప్లాట్‌ఫాంలలో ప్రయాణికులకు నీడనిచ్చే కవరింగ్ షెడ్స్ నిర్మాణం జరిగింది. వివిధ రైళ్ల ఫార్మసిన్ కోచ్ పొజిషన్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

అన్నమయ్య రాజంపేట రైల్వేస్టేషన్‌గా..

అన్నమయ్య రాజంపేట రైల్వేస్టేషన్‌గా మార్పు చేయడంలో తిరుమల తిరుపతి దేవస్థానం చొరవచూపాలంటున్నారు రాజంపేట వాసులు. పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు నడియాడిన ప్రాంతం కాబట్టి రైల్వే స్టేషన్‌కు అన్నమయ్య రైల్వే స్టేషన్‌గా పేరు ప్రతిపాదించాలని సాహితీ, అధ్యాత్మిక వేత్తలు కోరుతున్నారు.

ఎంపీ కృషితో రాజంపేట రూపురేఖలు మారాయి



అమృత్ భారత్ రైల్వే స్టేషన్ స్కీం కింద పనులు చేపట్టడం ఆనందకరం. అన్ని రైళ్లను ఇక్కడ ఆపే విధంగా రైల్వే బోర్డు నిర్ణయం తీసుకోవాలి. ఆర్వోబీ నుంచి స్టేషన్‌లోకి వెళ్లే విధంగా పాత్ కల్పించాలి. ప్రయాణీకుల సౌకర్యం కోసం రిటైరింగ్ రూం నిర్మించాలి.

– మర్రి రవికుమార్, వైస్ చైర్మన్, మున్సిపాలిటీ, రాజంపేట

అన్నమయ్య రాజంపేట రైల్వే స్టేషన్‌గా మార్చాలి



అన్నమయ్య రాజంపేట రైల్వే స్టేషన్‌గా మారుస్తూ ప్రతిపాదనను తిరుమల తిరుపతి దేవస్థానం పాలకల మండలి ఆమోదించి పంపాలి. అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో చేర్చి నూతన సొబగులు దిద్దారు. ప్రయాణికుల వసతికోసం చేపట్టిన ఆధునీకరణ పనులు బాగున్నాయి.

– శ్యామనబోయిన గౌరీశంకర్, తాళ్లపాక, అన్నమయ్య జన్మస్థలం

గొడ్డలితో దాడి

ముద్దనూరు : ఓ సంఘటనలో ఇరు వర్గాల వారు పరస్పరం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు.. దేనేపల్లెలో రామ్మోహన్ ఈ నెల 8న పెద్దమ్మ తల్లికి కొందరి సాయంతో యాటలు నిర్వహించాడు. అయితే గూనిగాండ్ల శివను దీనికి పిలవలేదు. దీంతో రామ్మోహన్ నీ కథ చూస్తా అంటూ గూనివాండ్లశివ బెదిరించాడు. అంతటితోఆగ కుండా రామ్మోహన్ మంగళవారం తోటలో పనిచేయిస్తుండగా.. లక్షుమయ్య, శివశంకర్, నరసింహ, ఉత్తయ్యలతో వచ్చి.. శివ తన గొడ్డలితో రామ్మోహన్‌పై దాడి చేశాడు. గాయాలైన రామ్మోహన్ ఫిర్యాదు మేరకు గూనివాండ్లశివ, మిగిలిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు

ముద్దనూరు : మండలంలోని దేనేపల్లి గ్రామానికి చెందిన విజయలక్ష్మి రామ్మోహన్ తోటలో కూలి పనులకు వెళ్లింది. పైపులు తేవాలంటూ తోట యజమాని రామ్మోహన్ ఆమెను పిలిచాడని, అక్కడ అసభ్యంగా ప్రవర్తించాడని, తప్పించుకోబోగా కులం పేరుతో దూషించాడని విజయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏదో విధంగా తప్పించుకుని బయటపడినట్లు ఆరోపించింది. దీంతో రామ్మోహన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి మృతి

వీరపునాయునిపల్లె : మండలంలోని వీరపునాయునిపల్లె ఎస్సీ కాలనీలో యువకుడు ప్రశాంత్(22) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. మృతుడు ప్రశాంత్ తల్లి మృతి చెందడంతో మద్యానికి బానిసైన ప్రశాంత్ జులాయిగా తిరుగుతూ తరచూ తండ్రితో గొడవపడేవాడు. గతంలోనూ ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం ఉందని ఎస్సై మంజునాథ్ తెలిపారు. రెండు రోజుల కిందట మళ్లీ తండ్రీ, కొడుకుల మధ్య ఘర్షణ జరగడంతో మనస్తాపానికి గురై సోమ వారం రాత్రి ఇంట్లోనే ప్రశాంత్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాపు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వైఫల్యం కప్పిపుచ్చుకొనేందుకే దాడులు

- సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని అరెస్ట్ అక్రమం
- టీడీపీ నేతలదంతా కల్పిత ఉద్యమం
- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



విలేకరులతో మాట్లాడుతున్న అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ప్రజలకు వాక్ స్వాతంత్ర్యం లేకుండా చేస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజద్‌బాషా ధ్వజమెత్తారు. కడపలోని తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పరిపాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఏదైనా పెద్ద సమస్య జరిగితే దాని నుంచి ప్రజలను పక్కదారి పట్టించడంలో చంద్రబాబును మించిన వారు దేశంలోనే లేరన్నారు. కొమ్మినేని శ్రీనివాసరావు ఐదు దశాబ్దాలుగా జర్నలిస్టుగా ఉన్నారని, పలు పత్రికల్లో, టీవీల్లో ఆయన పనిచేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కొమ్మినేని డిబేట్ షోలకు ప్రజాదరణ ఉందని, ఆయనంటే చంద్రబాబుకు పడదన్నారు. టీవీల్లో డిబేట్లు జరిగినపుడు పాల్గొన్న విశ్లేషకులు రకరకాల వ్యాఖ్యలు చేస్తుంటారన్నారు. ఇందులో భాగంగానే క్రిష్ణంరాజు అమరావతి పరిసరాల్లో సెక్స్ వర్కర్లు ఎక్కువగా ఉన్నారని వ్యాఖ్యలు చేశారన్నారు. దీనిని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. క్రిష్ణంరాజుతోపాటు కొమ్మినేని శ్రీనివాసరావు, సాక్షి ఛానెల్ కూడా క్షమాపణ కోరిందన్నారు. అయితే టీడీపీ నేతలు ఇంతటితో ఆగకుండా సాక్షి ఛానెల్, వైఎస్ జగన్‌ను, వైఎస్ భారతిలను ఇందులోకి లాగడం దుర్మార్గమన్నారు. కవెన్నుపోటు దినం' విజయవంతం కావడంతో ప్రజల దృష్టి మరల్చేందుకు ఓ కల్పిత ఉద్యమాన్ని సృష్టించి సాక్షి కార్యాలయాలపై దాడులు చేయించారన్నారు.

నాన్న కల.. నిజమయ్యేను నేడు..

తెలంగాణ జూనియర్ సివిల్ జడ్జిగా భవ్యశ్రీ


తండ్రి పసుపులేటి చంద్ర కుటుంబ సభ్యులతో భవ్యశ్రీ

ఓబులవారిపల్లె : పల్లెలోచదివినా.. ఏదో ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివారు భవ్యశ్రీ. తండ్రి కన్న కలలు సాకారం చేస్తూ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికై భేష్ అనిపించారు. మండలంలోని అటవీ ప్రాంతంలో శివారు గ్రామమైన వైకోటకు చెందిన పసుపులేటి చంద్ర, మాధురీదేవి కుమార్తె భవ్యశ్రీ 24 ఏళ్ల వయస్సులోనే తెలంగాణ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. త్వరలోనే ఆమె అక్కడ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆమె తండ్రి చంద్ర అట్లూరు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. చిన్ననాటి నుంచే న్యాయ శాఖలో తన కుమార్తెను చూడాలనే లక్ష్యం పెట్టుకున్నారు. తాను పోలీస్ వృత్తిలో ఉంటూ ప్రతి రోజూ న్యాయస్థానానికి వెళ్లి.. అక్కడ విధులు నిర్వహిస్తున్న వారిలాగే తన కుమార్తెను చూడాలని సంకల్పించుకున్నారు. ఆ విషయం తన కుమార్తెకు చెప్పి.. హైదరాబాద్ ఎన్టీఆర్ జూనియర్ కళాశాలలో శిక్షణ ఇప్పించారు. అనంతరం ఇంటర్మీడియట్ పూర్తి కాగానే వైజాగ్‌లోనే దామోదరం సంజీవయ్య లా యూనివర్సిటీలో ఐదేళ్ల కోర్సు చదివించారు. 2023లో తెలంగాణ హైకోర్టు, 2024లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ప్రాక్టీస్ చేయించారు. 2024లో తెలంగాణ హైకోర్టు నోటిఫికేషన్ జారీ చేయగా దరఖాస్తు చేసుకున్నారు. ప్రిలిమ్స్, మెయిన్‌లోనూ ప్రతిభ కనబరచడంతో భవ్యశ్రీ చిన్న వయస్సులోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. తన కల సాకారం చేసిన కుమార్తెను చూసి తండ్రి పసుపులేటి చంద్ర ఆనందానికి హద్దులు లేకుండాపోయాయి. ఆమెను గ్రామస్తులు, బంధువులు అభినందిస్తున్నారు.

న్యాయం వైపు నిలబడడమే లక్ష్యం

న్యాయస్థానాన్ని ఆశ్రయించే వారి వైపు నిలబడి న్యాయం చేయడమే ప్రధాన లక్ష్యం. కఠోరమైన సాధన చేసి లక్ష్యాన్ని సాధించాను. రోజూ ఎనిమిది గంటల నుంచి 12 గంటలపాటు శ్రమించి చదివాను. లా కాలేజీలో మంచి ఫౌండేషన్ లభించింది. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచే జడ్జి కావాలని లక్ష్యంగా పెట్టుకున్నా. సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగానే విధులు నిర్వహిస్తా.

– భవ్యశ్రీ



ప్రాణాలు కాపాడిన రైల్వే పోలీస్


కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

జమ్మలమడుగు : కుటుంబ కలహాలతో విసిగి ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చిన వ్యక్తిని వారించి రైల్వే పోలీసులు ప్రాణాలు కాపాడిన సంఘటన మంగళవారం జరిగింది. ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామానికి పల్లెటి మునుస్వామి మంగళవారం ఎర్రగుంట్ల మండలం కల్లమల్ల రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేశాడు. ఈ విషయం గమనించిన రైల్వే స్టేషన్ మాస్టర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సోమవారం అర్ధరాత్రి జీఆర్‌పీ ఆర్ఎస్‌ఐ రవిచంద్ర, ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ శివకుమార్ కలమల్ల రైల్వే స్టేషన్‌కు వెళ్లి మునుస్వామిని విచారించారు. అతడిని వారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కౌన్సిలింగ్ ఇచ్చి మునుస్వామిని భార్య, కుమారుల వెంట పంపించారు.

గోల్డ్ జ్యువెలరీ మేకింగ్ క్లస్టర్ ఏర్పాటు

కడప సెవెన్‌రోడ్స్ : పుత్తడిపురి ప్రొద్దుటూరులో గోల్డ్ జ్యువెలరీ మేకింగ్ క్లస్టర్ (జీజేఎంసీ) ఏర్పాటుచేసేందుకు ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ప్రొద్దుటూరు గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్ఠం చేసే దిశగా అన్ని రంగాల్లో నైపుణ్యం కలిగిన తయారీదారులు, పెట్టుబడి దారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు.

రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో గురువారం ఉదయం 9.30 గంటలకు బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ కార్యదర్శి వై.అహ్మర్ బాషా, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బసిరెడ్డి వీరకళ్యాణ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. స్త్రీ, పురుషులకు 100 మీటర్లు, 200 మీ., 400 మీ., 800 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, హై జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 14, 15వ తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామని వివరించారు. 18 ఏళ్లు నిండిన స్త్రీ, పురుషులు ఎవరైనా ఈ పోటీల్లో పాల్గొనవచ్చునని, వివరాలకు 9949686586, 8019880995 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

సీఎం సారూ నాకు న్యాయం చేయండి

సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన మేస్త్రీ పోస్ట్


సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన బాధితుడు

ములకలచెరువు : ములకలచెరువుకు చెందిన మేస్త్రీ మల్లికార్జున భార్య సునంద (21) రెండు నెలల క్రితం అదృశ్యమైంది. తన భార్య ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని, పోలీసులకు ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా కేసు నమోదు చేయలేదని బాధితుడు మల్లికార్జున తెలిపారు. పోలీసులకు పలుమార్లు చెప్పినా నిర్లక్ష్యంగా తనను స్టేషన్ చుట్టూ తిప్పుకుంటున్నారని ఆరోపించారు. తన భార్య ఐదు నెలల గర్భిణి కావడంతో ఓ మహిళ మాయమాటలు చెప్పి తీసుకెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ సారూ.. స్పందించి తనకు న్యాయం చేయాలంటూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇది కాస్త వైరల్ కావడంతో పోలీసులు మాత్రం తమకు ఎలాంటి ఫిర్యాదుఅందలేదని తెలిపారు. ఆరోపణలు చేసిన వ్యక్తి కనిపించడం లేదని స్థానికులు తెలిపారు.

బీజేపీని వ్యతిరేకించే ఏకైక పార్టీ కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలారెడ్డి

రాయచోటి జగదాంబసెంటర్ : బీజేపీని వ్యతిరేకించే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలారెడ్డి పేర్కొన్నారు. రాయచోటి పట్టణం మదనపల్లె రోడ్డు మార్గంలోని పీసీఎస్ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన షర్మిలారెడ్డి మాట్లాడుతూ బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పది సంవత్సరాలుగా ప్రత్యేక హోదా ఇస్తామని మోసం చేస్తున్నారని, విభజన హామీలలో ఏ ఒక్కటీ బీజేపీ నెరవేర్చలేదన్నారు. పోలవరం, రాజధాని అభివృద్ధి విషయంలోనూ అన్యాయం చేశారని, అధికార, ప్రతిపక్ష పార్టీలు బీజేపీకి పనిచేస్తున్నాయన్నారు. ప్రజల పక్షాన ప్రజా సమస్యల మీద ఏ పార్టీ నిలబడటం లేదని, కాంగ్రెస్ పార్టీ నిలబడుతోందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని సూపర్ సిక్స్‌లో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నెరవేర్చలేదని, రైతులకు రైతు భరోసా, మహిళలకు మహాశక్తి, తల్లికి వందనం, నిరుద్యోగభృతి గాలికి వదిలేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గాజుల భాస్కర్, జిల్లాలోని నియోజకవర్గ ఇన్‌చార్జులు, సీనియర్ పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లా..?


పులివెందులలో పోలీసులకు వినతి పత్రం అందిస్తున్న మీడియా ప్రతినిధులు


ముద్దనూరులో ఎస్ఐకు వినతిపత్రం సమర్పిస్తున్న పాత్రికేయులు

- అక్రమ అరెస్ట్‌పై మండిపడిన పాత్రికేయులు
- పోలీసులకు వినతి పత్రాలు

పులివెందుల టౌన్ : సాక్షి సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస్ అక్రమ అరెస్టు, సాక్షి కార్యాలయాలపై దాడులు, పత్రికా విలేకరులు, మీడియా మిత్రులపై జరుగుతున్న అక్రమ అరెస్టులను ఆపాలంటూ పులివెందుల జర్నలిస్ట్ అసోసియేషన్ ర్యాలీ చేపట్టింది. మంగళవారం పట్టణంలోని పాత బస్టాండు నుంచి మెయిన్ బజార్, పూలంగళ్ల సర్కిల్, కచేరి రోడ్డు మీదుగా అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు మీడియా మిత్రులు ర్యాలీగా చేరుకుని ఏఎస్‌ఐ సిద్ధార్థ, హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జునరెడ్డిలకు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్రంలో పాత్రికేయుల అక్రమ అరెస్టులపై, దాడులు, దౌర్జన్యాలు జరగకుండా చూడాలని, పత్రికా స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని వారు కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సాక్షి కార్యాలయాలపై దాడులు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు కార్తీక్, రాజు, దామోదర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రవీణ్, కృష్ణకుమార్, చంద్రమోహన్‌రెడ్డి, రమణారెడ్డి, జయరామిరెడ్డి, విమన్, సుబ్బారెడ్డి, ప్రకాష్, రాము, రామ్మోహన్, శంకర్, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరు : సాక్షి దినపత్రిక కార్యాలయాలపై దాడి, సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్టుకు నిరసనగా మండల పాత్రికేయ సంఘం ఆధ్వర్యంలో ఎస్‌ఐ మైనుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణమోహన్(సాక్షి), ఏసు(ప్రజాశక్తి), బాలకృష్ణ(వార్త), సుధాకర్(విశాలాంధ్ర), శ్రీనివాసులు (ప్రజాభూమి)నందకుమార్(జ్యోతి), భాస్కర్‌బాబు(సాయంకాలం) పాల్గొన్నారు.

ఏసీఏ సౌత్‌జోన్ అండర్–19 క్రికెట్ పోటీలు ప్రారంభం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ సౌత్ జోన్ అండర్–19 వన్డే క్రికెట్ మ్యాచ్‌లు మంగళవారం ప్రారంభమయ్యాయి. కడప కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు, కడప జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా.. తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు 33.1 ఓవర్లలో 124 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 15.4 ఓవర్లలో 3 వికెట్లు నష్టానికి 128 పరుగులు సాధించి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని రణధీర్ రెడ్డి 54, రోహిత్ వర్మ 37 పరుగులు చేశారు.

ఏడు వికెట్ల తేడాతో కర్నూలు జట్టు విజయం

వైయస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై కర్నూలు జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 48.1 ఓవర్లలో 176 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని కిన్ను కిషన్ 50 పరుగులు చేశాడు. కర్నూలు జట్టులోని మహిత్ 3, నౌసూన్ కళ్యాణ్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 177 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 34.0 ఓవర్లలో 3 వికెట్లు నష్టానికి 180 పరుగులు చేసి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ చెట్టులోని విఖ్యాత్ 66 పరుగులు చేశాడు.